**Publication: Eenadu** **Date: Monday, 17th February, 2014**
**Edition: Karimnagar**

# బీమాతో జీవితానికి ఆర్థిక భరోసా!

◆ పాలసీలపై అపోహ వీడాలి ◆ దీర్ఘకాలిక పెట్టుబడి శ్రేయస్కరం
◆ 'సిరి ఇన్వెస్టర్స్ క్లబ్' సదస్సులో నిపుణులు



సదస్సుకు హాజరైన ఔత్సాహికులు



సదస్సులో మాట్లాడుతున్న ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ యూనిట్ హెడ్ సతీష్ బాబు

**న్యూస్‌టుడే, కరీంనగర్ వాణిజ్యం, కరీంనగర్ పట్టణం**

'ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలని అందరూ కోరుకుంటారు. పిల్లలకు ఉన్నత విద్య, సొంతింటి కల, ఘనంగా వివాహాది శుభకార్యాలు పూర్తి చేయడం.. ఎలాంటి చింతా లేకుండా పదవీ విరమణ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో అంతర్లీనంగా ఉంటుంది. సంపాదించడం మొదలు పెట్టిన మొదటి రోజు నుంచే భవిష్యత్తు కోసం ప్రణాళిక వేస్తాం... మనం వేసిన ప్రణాళిక అమలుకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదు అంటే బీమాతో ధీమాగా ఉండాల'ని జెన్ మనీ డీజీఎం జె.వేణుగోపాల్ అన్నారు. 'దురదృష్టవశాత్తూ ఇంటి పెద్ద దూరమైతే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. సరైన బీమా ఉంటే అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవచ్చ'ని ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ యూనిట్ హెడ్ పి.సతీష్ బాబు అన్నారు. 'ఈనాడు సిరి ఇన్వెస్టర్స్ క్లబ్, జెన్ మనీ, ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్'లు సంయుక్తంగా ఆదివారం కరీంనగర్ కళాభారతిలో నిర్వహించిన మదుపరుల అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. 'ఈనాడు' కరీంనగర్ యూనిట్ ఇన్‌ఛార్జి జి.రమేశ్ బాబు 'సిరి ఇన్వెస్టర్స్ క్లబ్' గురించి మదుపరులకు పరిచయం చేశారు. సదస్సులో ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ గ్రూప్ హెడ్‌లు కె.ప్రియతమ్, కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

## జీవిత విలువ ఆధారంగానే..: జె.వేణుగోపాల్



మన వయసు, సంపాదన, ఇంకెంత కాలం ఆర్జించే అవకాశం ఉందనే అంశాలను పరిగణనలోకి తీసుకుని బీమా పాలసీలను ఎంపిక చేసుకోవాలి. జీవిత బీమాతోపాటు ఆరోగ్య బీమా, ఇంటి బీమా, నగలకు, వాహనాలకు కూడా బీమా అవసరమే.

● సంపాదనలో 5 శాతం వరకూ బీమా పాలసీలకు కేటాయించవచ్చు. చిన్న వయసులో పాలసీలను ఎంచుకుంటే ప్రీమియం తక్కువగా ఉంటుంది.

● బీమా పాలసీలు అనేకం ఉన్నాయి. ఇందులో మనకు ఏది అవసరమో గుర్తించాలి. దానివల్ల ప్రయోజనాలేమిటో తెలుసుకోవాలి. బంధువులు, తెలిసిన వాళ్లు వచ్చి పాలసీ తీసుకోమంటే మొహమాట పడి ప్రీమియం చెల్లించొద్దు. ఆ పాలసీ గురించి మీరు పూర్తిగా ఆరా తీయండి. అవసరమైతే నిపుణులతో మాట్లాడండి. బీమా కంపెనీ సేవా కేంద్రాన్ని సంప్రదించినా పూర్తి వివరాలు తెలుస్తాయి.

● ఒకసారి పాలసీ తీసుకున్న తర్వాత దాని వ్యవధి తీరేంతవరకూ కొనసాగండి. మధ్యలోనే ఆపేస్తే ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

● బీమా కంపెనీల పూర్వాపరాలు, వాటి క్లెయిం పరిష్కార చరిత్ర, ఇతర అంశాలను పరిశీలించాకే పాలసీ గురించి నిర్ణయం తీసుకోవాలి.

● సంప్రదాయ పాలసీలతో అధిక బీమా పొందాలంటే ప్రీమియం భారీగా చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ ఇచ్చే టర్మ్ పాలసీలకు ప్రాధాన్యం ఇవ్వండి.

● కుటుంబానికి అంతటికీ వర్తించేలా ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి. నగదు రహిత చికిత్స, తీవ్ర వ్యాధుల వైద్యానికి వర్తించడం, ఉప పరిమితులు లేకపోవడంలాంటివి పాలసీ తీసుకునేప్పుడు పరిశీలించాల్సిన ముఖ్యమైన అంశాలు.

● ప్రస్తుతం పాత పాలసీలను ఈ ఇన్సూరెన్స్‌కు మార్చుకునే అవకాశం ఉంది. ఈ ఖాతా ప్రారంభించడానికి వ్యక్తిగత, చిరునామా గుర్తింపు వివరాలు, ఫొటో, బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే సరిపోతుంది. ఇప్పటికే ఉన్న పాలసీలతో పాటు కొత్తగా తీసుకునే వాటిని కూడా ఈ ఖాతాలోకి మార్పించుకోవచ్చు. దీనివల్ల పాలసీల నిర్వహణ సులువు అవుతుంది. కష్టకాలంలో క్లెయిం చేసుకోవడం నామినీలకు కూడా తేలిక అవుతుంది.

● ఇంటి రుణం తీసుకొని ఇల్లు కొనుగోలు చేసినా, నిర్మించినా హోంలోన్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించండి. రుణగ్రహీతకు ఏదైనా జరిగితే ఇంటి అప్పు సంగతి బీమా కంపెనీ చూసుకుంటుంది. కుటుంబ సభ్యులకు ఆర్థిక భారం ఉండదు.

● జీవిత బీమా పాలసీలకు చెల్లించిన ప్రీమియానికి ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు (గరిష్ఠంగా రూ.లక్ష) వర్తిస్తుంది. ఆరోగ్య బీమా పాలసీలకు చెల్లించిన ప్రీమియానికి రూ.15 వేల వరకూ సెక్షన్ 80డీ కింద మినహాయింపు పొందవచ్చు. వయోధికులకు ఈ పరిమితి రూ.20 వేలు. తల్లిదండ్రుల కోసం ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంటే అదనంగా రూ.15 వేల (సీనియర్ సిటిజన్లయితే రూ.20వేలు) వరకూ మినహాయింపు వర్తిస్తుంది.

● పెట్టుబడులు ఎప్పుడూ వైవిధ్యంగా ఉండేలా చూసుకోండి. దీర్ఘకాలం కొనసాగించండి. అప్పుడే మంచి రాబడిని ఆశించడానికి అవకాశం ఉంటుంది.

## కుటుంబానికి అండగా... : సతీష్ బాబు



బీమా అంటే పాలసీదారుడు మరణిస్తే డబ్బు ఇచ్చే పథకం మాత్రమే అనే అభిప్రాయం సరి కాదు. బీమా పాలసీలపై సంపూర్ణ అవగాహన పెంచుకుంటే ఆర్థిక ప్రణాళికల్లో అవి ఎంత కీలకమో అర్థం అవుతుంది. ప్రతి వస్తువుకు రెండు విలువలుంటాయి.. ఒకటి ఆర్థిక విలువ, రెండోది భావోద్వేగ విలువ. రెండో దాన్ని బీమా కంపెనీలు భర్తీ చేయలేవు. అయితే ఒక వ్యక్తి దూరం అవడం వల్ల కుటుంబానికి ఏర్పడే ఆర్థిక నష్టాన్ని కొంత మేరకు భర్తీ చేసి భరోసా ఇస్తాయి.

● ఖర్చులు పెరిగినంత వేగంగా సంపాదన వృద్ధి చెందకపోవచ్చు. కాబట్టి, సంపాదన మొదలు పెట్టగానే పొదుపు, పెట్టుబడులకు తగిన ప్రణాళిక వేసుకోవాలి. చిన్న వయసులో నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పకపోవచ్చు.

● బీమా పాలసీని కూడా నిత్యావసర వస్తువుగా భావించడం మంచిది. స్వల్పకాలిక పొదుపు, పాలసీలతో పెద్దగా ప్రయోజనం ఉండదు. దీర్ఘకాలిక బీమాతోనే భవితకు భరోసా అని గుర్తించాలి. ప్రతి ఒక్కరూ కనీసం రూ.2 లక్షలకైనా బీమా చేయాలి. హఠాత్తుగా ఏదైనా జరిగితే కుటుంబానికి కొంతలో కొంత ఆర్థిక ఆసరా లభిస్తుంది. గరిష్ఠంగా ఎంత మొత్తానికి అనేది వారి వారి ఆర్థిక స్తోమత, బాధ్యతలను బట్టి నిర్ణయించుకోవాలి.

● చేసే ఉద్యోగం, నష్ట భయాన్ని అంచనా వేసి తగిన పాలసీని ఎంచుకోవాలి.

● చిన్న వయసులోనే బీమా తీసుకోవాలి. క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లించాలి. పాలసీని దీర్ఘకాలం కొనసాగించాలి. ఈ మూడు విషయాలను ఎప్పుడూ విస్మరించవద్దు.

● మారిన జీవన శైలితో ఖర్చులు పెరిగాయి. అధిక మొత్తం వ్యయం చేసి, తర్వాత మిగిలితే పొదుపు కోసం కాస్త కేటాయిస్తున్నారు. ఇది సరికాదు. మనకున్న లక్ష్యాల ఆధారంగా నిర్ణీత మొత్తాన్ని పొదుపు చేశాకే ఖర్చు చేయాలి. సాధ్యమైనంత వరకూ అప్పులకు దూరంగా ఉండాలి.

A Joint Venture of Bank of Baroda, Legal & General, Andhra Bank